REGD No. H 18

విడి ప్రతి 0-25 పై.

17-6-66 శుక్రవారం

# జమీన్ రైతు

స్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 38 ] సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి [ సంచిక 24

### ఆంధ్రలో ఎదురులేని నాయకుడుగా దేశమంతట

### గుర్తింపుపొందుటకు శ్రీ సంజీవరెడ్డి పడుతున్న బాధే

# ఆంధ్ర కాంగ్రెస్‌లో ముసలం పుట్టడానికి కారణం!

బ్రహ్మానందరెడ్డిగారు సంజీవరెడ్డిగారు చెరొకవర్గంగా చీలిపోయారు, వీరిద్దరిలో కలిగిన విభేదాలు ప్రగాఢమైనవి, అగాధమైనవనే సత్యం రాష్ట్ర కాంగ్రెసువాదుల్లో ముఖ్యంగా వీరిద్దరిని ఇంతవరకూ అనుసరిస్తూ వచ్చినవారిలో క్రితం వారంవరకూ నమ్మకం కుదరలేదు.

ప్రదేశ్ కాంగ్రెస్ ఎన్నికల సంఘం సమావేశంలో, మంత్రివర్గంలో ఏర్పడిన చీలికలే ప్రతిబింబించడం, ఏ. సి. నూకల, మీర్ అహ్మద్ అలీఖాన్, శ్రీమతి రుక్మిణమ్మగారలు-బ్రహ్మానందరెడ్డి, తిమ్మారెడ్డి, తోటరామస్వామి, బి.వి.రాజు, డాక్టర్ చెన్నారెడ్డిగార్లకు వ్యతిరేకంగా వోటుచేయడం, పైగా మెజారిటీ నిర్ణయానికి వ్యతిరేకంగా తాము వేరే వ్యక్తిగత నోటుదానిని తయారుచేసి, దాన్ని నూకల రామచంద్రారెడ్డిద్వారా కాంగ్రెస్ అధ్యక్షునికి పంపించడం ఇవన్నీ అంతవరకూ అనుమానంగా, నమ్మశక్యంగాలేని వారందరికి కనువిప్పు కలిగించింది.

ఆంధ్ర రాజకీయాల్లో కొంతకాలం-మాటవరసకు పదిసంవత్సరాలపాటు-కలిసి రాజకీయ సహచరులుగా, మిత్రులుగా ఉన్నవారు విడిపోవడం, ప్రబలప్రతిపక్షులుగా తయారు కావడం అపూర్వమైనదేమీకాదు.

స్వయంగా సంజీవరెడ్డిగారే కళా వెంకట్రావులాంటివారి మార్గదర్శకత్వం క్రింద, ఆంధ్ర ప్రజానాయకుడైన ప్రకాశంపంతులుగారిని గద్దెదించడానికి సందేహించలేదు. తరువాత ప్రకాశంపంతులుగారిని విస్మరించి, అలక్ష్యంచేసి ఆంధ్రలో ఏ రాజకీయ నాయకుడు హెచ్చుకాలం అధికారం చెలాయించలేడని తెలిసి, కళా వెంకటరావు ప్రత్యేకతలను లెక్కచేయక, అల్లూరి సత్యనారాయణరాజుతో కలిసి ప్రకాశంగారిని తమనాయకుడుగా స్వీకరించడం, తరువాత సంజీవరెడ్డి, అల్లూరి ఒకరినొకరు అన్నాతమ్ముడుగా భావించుకుంటున్నట్లు అందరికీచెప్పి, చూపి, రాజకీయంగా అవినాభావసంబంధంకలవారుగా చెలామణియై, చివరికి ముఖ్యమంత్రి పదవిపై కీచులాడుకొనడం, విడివడి, బద్ధశత్రువులుగా లోకానికి వెల్లడికావడం చరిత్రగ్రస్తమైన సత్యం. సరిగా అవంధానే నేడు బ్రహ్మానందరెడ్డి సంజీవరెడ్డి సంబంధాలు నడుస్తున్నాయి. అల్లూరిని సంజీవయ్యనుంచి విడదీసి, తరువాత అల్లూరి వల్లంరాజుగార్ల కళ్ళలో దుమ్ముకొట్టి, సంజీవరెడ్డిగారు తిరిగి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిగా వచ్చేసేటందుకు రాజబాటను వేయడంలో బ్రహ్మానందరెడ్డిగారు పడినశ్రమ, చూపిన చాతుర్యం, శ్రద్ధాసక్తులు అమోఘమైనవనీ, ఇవిలేకుంటే సంజీవరెడ్డిగారు అంత సునాయాసంగా ఆంధ్ర నాయకత్వాన్ని తిరిగి చేపట్టగలిగేవారుకారని వేరే చెప్పనక్కరలేదు. ఐతే ఆచార్య రంగా, బెజవాడ గోపాలరెడ్డి మొదలైన అతిరేరిన, తనకంటే సీనియర్‌గావున్న రాజకీయవేత్తలపై పైచేయి పొంది, తెలంగాణాలో బూర్గుల రామకృష్ణరావుగారిలాంటివారి సహకారాన్ని పొంది విశాలాంధ్ర నాయకత్వాన్ని వహించడంలో కొంతకాలంక్రితం అల్లూరికూడా, బ్రహ్మానందరెడ్డివలెనే శ్రమించి, కృషిచేసి కృతకృత్యులయ్యారు.

చూడబోతే ఏరుదాటడానికి ఉపయోగించుకున్న తెప్పను తగులబెట్టకపోతే సంజీవరెడ్డిగారు ఆంధ్ర నాయకత్వాన్ని సుస్థిరం చేసుకోలేరేమోనని భావించవలసి వస్తున్నది.

లేకపోతే బ్రహ్మానందరెడ్డిగారి విషయంలో ఆయన ప్రవర్తనకు మరొక కారణం కనిపించదు. లాల్‌బహదూర్ శాస్త్రి వారసురాలుగా శ్రీమతి ఇందిరా గాంధీని ప్రతిపాదించి బలపరచడంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బ్రహ్మానందరెడ్డిగారు చొరవతీసుకొని పనిచేశారు. ఆయన వత్తిడే లేకపోతే, సంజీవరెడ్డిగారు మరొకమార్గ మవలంబించేవారు. చివరికి ఆమెను సమర్థించినా తగువేరంచేసి మరీ చేసేవారు. అలా కానందున, ఈనాడు ప్రధానమంత్రికి తమ మంత్రివర్గ సభ్యులైన సంజీవరెడ్డికంటే, ఆంధ్ర ముఖ్యమంత్రే సన్నిహితంగా వున్నారు. అంతేగాక విశాఖపట్టణం ఉక్కు కర్మాగారం విషయంలో తాను ఉక్కుమంత్రిగానున్న కాలంలో ఎలాంటి అనుకూలమైన నిర్ణయాన్ని ఆయన చేయలేకపోగా, ఈనాడదికూడా ఖారీ విద్యుత్ పరికరాల ఫ్యాక్టరీవలెనే రెండు లేక మూడు భాగాలుగా విభజించబడి, తమకు రాజకీయ బలాన్నిఇచ్చే మద్రాసు, మైసూర్లకుకూడా భాగం పంచిపెట్టాలనుకుంటున్నప్పుడు, అందుకు బ్రహ్మానందరెడ్డిగారు అడ్డుతగులుతున్నారు.

—తరువాయి 7 వ పేజీలో

### మా హైదరాబాదు విలేఖరి

[6 వ కాలంతరువాయి]

సమ్మతించలేదని చెప్తున్నారు.

ఈ ప్రతిపాదనవెనుక రెండు ఉద్దేశ్యాలున్నాయంటారు. ఒకటి: బ్రహ్మానందరెడ్డిని దెబ్బతీయడం, రెండు: సంజీవయ్యను ప్రధాని ఇందిరా గాంధీనుండి దూరం చేయడం. ఈ ప్రతిపాదనవార్త నిజమైతే సంజీవరెడ్డిగారు ఎందుకైనా సరే అనుకోవలసివుంటుంది!

# ఢిల్లీలో ముఖ్యమంత్రి విజయం-సంజీవయ్య కలయిక కుపూర్తి అవకాశం?

(మా రాజకీయ పరిశీలకుడు)

ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డిగారు హైదరాబాదు లోనేకాదు, ఢిల్లీలోకూడా విజయుడైనట్లు వార్తలు దృఢంగా తెల్పుతున్నాయి. ఎంతో ఆశతో, ఎంతోధీమాతో, ఎంతో వుడుకుతో ముఖ్యమంత్రి కంటే ముందు ఢిల్లీకి పరుగెత్తిన రివిన్యూమంత్రి శ్రీ నూకల రామచంద్రారెడ్డి, ఇర్రిగేషన్ మంత్రి శ్రీ ఏ. సి. సుబ్బారెడ్డి ఆశాభంగం పొందక తప్పలేదని దినపత్రికల వార్తలేకాదు, ఢిల్లీకి పోయివచ్చిన వారుకూడా ఇంకా స్పష్టంగా చెప్తున్నారు.

కౌన్సిల్ అభ్యర్థుల నిర్ణయానికి సంబంధించి ఆంధ్రకు సంబంధించి కేంద్ర పార్లమెంటరీబోర్డు వ్రేలుపెట్టదలచుకుంటే, ఇక ప్రతిరాష్ట్రంలో అదేవిధంగా చేయవలసి

—తరువాయి 7 వ పేజీలో

### సంజీవయ్యకు ముఖ్యమంత్రిత్వ ఆశ చూపారా?

శ్రీ సంజీవయ్యను శ్రీ సంజీవరెడ్డిగారితో కలుపుటకు ఢిల్లీలో విశ్వప్రయత్నం జరిగినట్లుంది. ఇదంతా ఏ. సి. సుబ్బారెడ్డిగారో, లేక మరొకరో తమంతటతామగా చేసిన ప్రయత్నంకాదు- సంజీవరెడ్డిగారి అభిమతానుసారమే జరిగినట్లుంది. మొన్న ఢిల్లీలో ఒక ఆంధ్రమంత్రి (ఏ. సి. కాదు) సంజీవయ్యగారివద్దకుపోయి, సంజీవరెడ్డిగారు వారిని (సంజీవయ్యను) ముఖ్యమంత్రి చేయుటకు సిద్ధంగా వున్నారన్నేప్రతిపాదనచేయడం జరిగిందట. కాని సంజీవయ్య దానికి

—తరువాయి 3 వ కాలంలో

శ్రీ వేంకటేశ్వర ట్యుటోరియల్ కాలేజి,

ఉస్మాన్‌సాహెబుపేట - నెల్లూరు-2

(టైపు ఇన్‌స్టిట్యూట్ గలదు)

P. U. C., VIIth Form., S. S. L. C., & Matric లకు

క్లాసులు : 10-6-1966 నుండి ప్రారంభమైనవి.

హిందీ క్లాసులుకూడ జరుగుచున్నవి.


మెట్రిక్ క్లాసులో కొద్ది సీట్లుమాత్రమే యున్నవి.

వెంటనే అడ్మిషన్స్‌కై త్వరపడండి.

కే. వేంకటరమణయ్య, B. A., B. Ed.,

ప్రిన్సిపాల్.

రైతులకు విజ్ఞప్తి



తక్కావి ఋణములకుగాను గవర్నమెంటువారిచే అప్రూవుచేయబడిన

కిర్లోస్కర్ - లిస్టర్, ఫీల్డుమార్షల్, భారత్

క్రూడాయిలు యింజన్లు - మోటార్లు : పంపుసెట్లు - అన్ని రకముల వ్యవసాయ పరికరములు - మేలురకములు మా వద్ద దొరకును.

భారత్ ఇంజనీరింగు కార్పొరేషన్

15/202-A బృందావనం - నెల్లూరు.

అసోసియేట్ ఆఫీసులు:- మద్రాసు, విజయవాడ, గుంటూరు

